ఆహ్లాదం.. ఆధ్యాత్మికం

కొమ్మాది.. ఓ వైపు ప్రకృతి అందాల సమూహం, మరోవైపు ఆధ్యాత్మిక పరవశం, వీటి మధ్య చారిత్రక నేపథ్యం అన్నీ కలగలిపిన సమాహారమే భీమిలి తీరం. కార్తీక మాసం వచ్చిందంటే ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచుతూ వనభోజనాలకు పర్యాటకులను ఈ తీరం వెంబడి అందాలు రారమ్మని పిలుస్తాయి.

- కనులు చెదిరే అందాలు.. మనసు పులకరించే ఆధ్యాత్మికతతో అలరారుతున్న భీమిలి తీరం
- కార్తీకమాసంలో వనభోజనాలకు అనువైన నెలవు
- పర్యాటకులను రారమ్మని పిలుస్తున్న తీర ప్రాంత అందాలు



శిలా తోరణం..

మంగమారిపేట బీచ్ వద్ద సహజ సిద్ధంగా ఏర్పడిన అనేక ఆకృతులు గల శిలా సంపదకు ఇది ఒక స్థావరం. వీటిలో ప్రత్యేకంగా శిలా తోరణం పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఫొటో షూట్, షార్టు ఫిల్మ్‌లు, సీరియల్స్, సినిమాలకు ఇది ఒక ఎసెట్‌గా మారింది. వేదాలకు నిలయమైన వారీజా ఆశ్రమం ఎదురుగా ఉంది.



బౌద్ధారామాలు..

భీమిలి తీర ప్రాంతాల్లో చరిత్రకు ఆనవాళ్లుగా అలనాటి తొట్లకొండ, బావి కొండలు విలసిల్లుతున్నాయి. వీటిపై నీటి తొట్టెలు, చైత్యాలు, స్థూపాల వంటి చారిత్రక ఆనవాళ్లు ఎన్నో ఉన్నాయి.



సీ పాయింట్ పార్కు..

మంగమారిపేట తొట్లకొండపై సీపాయింట్ పార్కు ఓ అద్భుతం. ఇక్కడి నుండి ఒంపులు తిరిగిన నీలి సంద్రం పర్యాటకులకు కనువిందు చేస్తుంది. ఇక్కడ చుట్టూ పార్కు, బెంచీలు వంటివి ఏర్పాటు చేశారు. పిక్‌నిక్ సీజన్‌లో కుటుంబంతో గడపడానికి ఈ పార్కు ఎంతో విశాలంగా ఉంటుంది. ఈ ప్రాంతానికి ఆటో ద్వారా లేదా 900కె బస్సు ద్వారా చేరుకోవచ్చు. ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇక్కడ ప్రవేశానికి అనుమతి ఉంటుంది. ఇక్కడి చరిత్ర తెలుసుకునేందుకు గైడ్ లక్ష్మణ్‌ను 91631175776 నంబర్‌లో సంప్రదించవచ్చు.



వారీజా ఆశ్రమం..

వేదాలకు నిలయమైన వారీజా ఆశ్రమం మంగమారిపేటలో ఉంటుంది. వేద పాఠశాల, నేత్ర విద్యాలయంతో పాటు హయగ్రీవ మందిరం ఉన్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఇక్కడ వేదాధ్యయనం జరుగుతుంది.

రామాద్రి..



ఆధ్యాత్మిక ఆద్రి రామాద్రి. ఇక్కడ అడుగడుగూ రామ నామం వినిపిస్తుంది. ఈ ప్రాంగణంలో హనుమంతుడు, శివుడు, వినాయకుడు, శ్రీరాముడు, వేంకటేశ్వరుని ఆలయం, కదంబ వనవాసిని, దత్తాత్రేయుడు, శ్రీకృష్ణుడు, నవగ్రహాల ఆలయాలు ఉన్నాయి. వేలాది తులసి కోటలు, గోశాల వంటివి ప్రత్యేకం. ఇక్కడికి ఒక్కసారి చేరుకుంటే సకల దేవతలను దర్శించుకునే అవకాశం ఉంటుంది.

సీవ్యూ పార్కు..




మంగమారిపేట తొట్లకొండకు అతి సమీపంలో సీవ్యూ పార్కు ఉంది. విశాలమైన ప్రదేశంలో పచ్చని తివాచీలా కనువిందు చేస్తుంది. ఇక్కడ వన భోజనాలు చేసేందుకు అనువైన స్థలం, పచ్చని చెట్ల నీడ ఉంటాయి. ప్రవేశం ఉచితం.

రుషికొండ శ్రీవారి ఆలయం..

ఇక్కడి కొండపై శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించారు. ఈ కొండపై నుండి ఒంపులు తిరిగిన సముద్రం కనువిందు చేస్తుంది.





సాగరతీరాన ఇస్కాన్ మందిరం

వైజాగ్ నుండి భీమిలి మార్గ మధ్యలో సాగర్‌నగర్ వద్ద శ్రీ రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథులు కొలువైన ఇస్కాన్ మందిరం ఉంది.



అద్భుతం మొగదారమ్మ ఆలయం..

సాగర్‌నగర్ బీచ్ రోడ్డు వద్ద మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయం మహాద్భుతం. భారతీయ సంస్కృతి అద్దం పట్టేలా ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకోవచ్చు. ఈ ఆలయ ప్రాంగణంలో 12 రాశులు, 16 నృత్య కళలు, 12 పుష్కర దేవతల రూపాలను అద్భుతంగా శిలలపై మలిచారు. దాంతో పాటు త్యాగరాజు స్వామి, వటపత్ర సాయి, శ్రీకృష్ణ పరమాత్ముని వంటి రూపాలు అడుగడుగునా దర్శనమిస్తాయి. ఇక్కడ అణువణువునా శిల్ప కళ మహాద్భుతంగా గోచరిస్తుంది.

అందాల రుషికొండ..

బ్లూ ఫ్లాగ్ బీచ్‌గా మన రాష్ట్రంలో ఒక రుషికొండకు మాత్రమే అవకాశం దక్కింది. ఇక్కడ ఎక్కడా లేని విధంగా తీరం విశాలంగా ఉంటుంది. అంతే కాకుండా పర్యావరణ హితంగా, ప్రమాద రహితమైన బీచ్‌గా గుర్తింపు పొందింది. బోటు షికారు, పచ్చదనంతో కూడిన అందమైన పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేకమైన చిల్డ్రన్ పార్కు వంటివి ఎన్నో ఈ బీచ్ సొంతం. ఇలా పర్యాటకులు కుటుంబాలతో ఈ కార్తీకమాసంలో గడిపేందుకు తీర ప్రాంత ప్రకృతి అందాలు స్వాగతం పలుకుతున్నాయి.

రామానాయుడు ఫిల్మ్ స్టూడియో

భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలో డాక్టర్ డి. రామానాయుడు స్టూడియో ఉంది. కొండపై నుండి సీవ్యూ అద్భుతంగా ఉంటుంది. బంగ్లా, షాపింగ్ కాంప్లెక్స్ ఎన్నో ఇక్కడ నిర్మించారు. ప్రతి రోజూ ఉదయం గం. 9.30 నుండి సాయంత్రం గంటల 5 వరకు సందర్శించవచ్చు. పెద్ద వారికి రూ. 60, పిల్లలకు రూ. 30 టికెట్ రుసుము వసూలు చేస్తున్నారు.

ఎర్రమట్టి దిబ్బలు..

ఇటు బీచ్ రోడ్డు, ఐఎన్ఎస్ కళింగ, నేరెళ్లవలస, నిడిగట్టు, జేవీ అగ్రహారం నడుమ 1195 ఎకరాల్లో ఈ ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నాయి. ఇందులో 295 ఎకరాలను జియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అరుదైన జాతీయ వారసత్వ సంపదగా గుర్తించింది. ఇవి 60 నుంచి 80 అడుగుల ఎత్తు వరకు కొండల వలే కనిపిస్తాయి. చుట్టూ ఎటు చూసినా ఎర్రటి మట్టితో కప్పబడే ఈ ఎర్రమట్టి దిబ్బలు భీమిలి అందాలకు కీర్తి కిరీటం.

క్లుప్తంగా

ప్రజల జీవితాల్లో ఈ దీపావళి వెలుగులు నింపాలి



మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: ఈ దీపావళి భీమిలి నియోజకవర్గ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. మనలో నిండిన అంధకారం తొలగి, దీపాల వెలుగుతో జ్ఞానజ్యోతులు వెలగాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితాలలో లక్ష్మీదేవి అష్టైశ్వర్యాలు సిద్ధించాలన్నారు. దీపావళి పండగను ప్రజలంతా పర్యావరణహితంగా, జాగ్రత్తలు పాటించి జరుపుకోవాలని చిన్న శ్రీను కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని అనంతవరంలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు దీపావళి విశిష్టత గురించి ప్రచారం చేశారు. భగద్గీత ఆవశ్యకత గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, భవానీ, అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రొఫెసర్ మృతదేహం గీతం కాలేజీకి అప్పగింత



మాజీ ప్రొఫెసర్ దివాకరరాయ్ (ఫైల్)

పీఎం పాలెం: ఏయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేసిన మాజీ ప్రొఫెసర్ దివా కర రాయ్ (78) శనివారం గుండెపోటుతో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మరణించారు. ఆయన పీఎం పాలెంలోని అశోక్ నగర్‌లో గత కొంత కాలంగా నివసిస్తున్నారు. ప్రముఖ హేతువాదిగా దుర్తింపు పొందారు. ఆదివారం ఆయన నివాసం వద్ద పార్థివదేహాన్ని సందర్శనకు ఉంచారు. వైద్య విద్యార్థుల శిక్షణ కోసం గీతం కాలేజీకి ఆయన కోరక మేరకు దేహాన్ని కుటుంబ సభ్యులు గీతం కాలేజీకి దానం చేశారు. మాజీ ఏయూ చాన్సలర్ బీల సత్య నారాయణ, నాగేశ్వరరావు, మాజీ ఉద్యోగులు రాధాకృష్ణ, ప్రజా శక్తి మాజీ మేనేజరు ఎన్. సుధాకర్, దళిత సంఘం నాయకుడు దడాల భాస్కర్, సీఐటీయూ నాయకుడు డి. అప్పలరాజు తదితరులు దివాకర రాయ్‌కు నివాళులు అర్పించారు.

కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు



కరెన్సీ నోట్ల అలంకరణలో ధనలక్ష్మి అమ్మవారు

కొమ్మాది: స్థానిక అన్నం రాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఆదివారం ధనత్రయోదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీ ధనలక్ష్మి అమ్మవారికి కరెన్సీ నోట్లు, నాణాలు, పసుపు కుంకుమలతో అలంకరించారు. లక్ష్మీ హోమం, సామూహిక పారాయణలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు.

భీమిలి రోడ్డులో పందుల సంచారం



మహలక్ష్మిపురం వద్ద పందులు

తగరపువలస: భీమిలి రోడ్డులోని రేఖవానిపాలెం పంచాయతీ మహలక్ష్మిపురంలో పందుల సంచారంతో పర్యాటకులు హడలిపోతున్నారు. పదుల సంఖ్యలో పందులు పంచాయతీలోని తాతాజీనగర్ వద్ద శిథిలమైన డ్రైనేజీలు, తుప్పల మధ్య తిష్ట వేసి తరచూ రోడ్డుపై ప్రయాణికులకు అడ్డం పడుతున్నాయి. అంతే కాకుండా రహదారికి ఇరువైపులా దువ్వి గోతులు చేస్తున్నాయి. చెత్త కుప్పలను ధ్వంసం చేసి గ్రామాలను మురికి చేస్తున్నాయి. భీమిలి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామం మీదుగానే ఎమ్మెల్యే, అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ ఈ గలీజు వాతావరణంపై దృష్టి సారించడం లేదు. తాతాజీనగర్‌లో శిథిలమైన డ్రైనేజీలకు మరమ్మతులు నిర్వహించి పందులను దూరంగా తరలించాలని కోరుతున్నారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల విజేతలు వీరే

తగరపువలస: ఈ నెల 17, 18 తేదీల్లో చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన అండర్-14, 17 బాలికలు, బాలుర విన్నర్స్, రన్నర్స్ జట్ల వివరాలు ఆదివారం వెల్లడించారు. అండర్-14 బాలికల విభాగంలో కబడ్డీలో విన్నర్స్‌గా దాకమర్రి జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ నిలిచాయి. ఖోఖో చిట్టివలస, ఆర్.తాళ్లవలస, వాలీబాల్ భీమిలి కేథరిన్, లక్ష్మీపురం, బాడ్మింటన్ సన్‌స్కూల్, భీమిలి ఏపీఆర్ఎస్, యోగా సన్‌స్కూల్ (విన్నర్స్), చెస్ ఏపీఆర్ఎస్, భీమిలి గవర్నమెంట్ హైస్కూల్ అండర్-17 బాలికల విభాగంలో కబడ్డీ లక్ష్మీపురం, మజ్జిపేట, ఖోఖో తాళ్లవలస, చిట్టివలస, వాలీబాల్ ఏపీఆర్ఎస్, భీమిలి గవర్నమెంట్ హైస్కూల్, బాడ్మింటన్ ఏపీఆర్ఎస్, చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్, యోగా సన్ స్కూల్, చెస్ చిట్టివలస జెడ్పీ నవజీవన్ విద్యార్థులు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచారు. అలాగే అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీ మజ్జిపేట, భీమిలి ఎంఎఫ్‌సీయూపీ, ఖోఖో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాస విద్యాలయం, చిన ఉప్పాడ జెడ్పీ వాలీబాల్ నేతాజీ సుభాష్ చంద్రబోస్, గవర్నమెంట్ హైస్కూల్, బాడ్మింటన్ సంగివలస శశి, తాళ్లవలస తిరుమల, యోగా సన్‌స్కూల్, చెస్ చిట్టివలస జెడ్పీ హైస్కూల్, నవజీవన్ అండర్-17 బాలుర విభాగంలో కబడ్డీ చిట్టివలస, లక్ష్మీపురం, ఖోఖో నేతాజీ సుభాష్ చంద్రబోస్, భీమిలి ప్రభుత్వ హైస్కూల్, వాలీబాల్ సెడార్, భీమిలి ప్రభుత్వ హైస్కూల్, బాడ్మింటన్ భీమిలి బీజీఎం, సంతపేట అంబేడ్కర్, యోగా సన్ స్కూల్, చెస్ నేతాజీ సుభాష్‌చంద్రబోస్, భీమిలి సెయింటాన్స్ విద్యార్థులు నిలిచారు.

22న గోవర్ధన పూజ



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధామదన్ మోహనులు



నెయ్యి దీపాలతో హారతులు ఇస్తున్న భక్తులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దామోదర దీపోత్సవంలో భాగంగా ఈ నెల 22 సాయంత్రం 6 గంటలకు గోవర్ధన పూజ నిర్వహించనున్నట్టు యదురాజ దాస తెలిపారు. ఆదివారం ఆయన భక్తులతో మాట్లాడుతూ గోవర్ధన పూజ సందర్భంగా వివిధ రకాలైన పిండి వంటలతో గోవర్ధన గిరి నమూనా తయారు చేయనున్నట్టు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శ్రీకృష్ణ భగవానుని కృప పొందాలని కోరారు. అలాగే దామోదర మాసం 13వ రోజు సందర్భంగా ఆదివారం భక్తులు నెయ్యి దీపాలను శ్రీకృష్ణునికి ఇష్టమైన దామోదర అష్టకం పాడుతూ హారతిగా అందించారు. ఈ కార్యక్రమాలను అంబరీష దాస పర్యవేక్షించారు.

కూటమి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజలు



నమ్మివానిపేటలో సంతకాలు సేకరిస్తున్న 2వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న గుడ్ల పోలిరెడ్డి

కొమ్మాది: మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ అనే అంశం ప్రజా సమస్యగా పరిగణించాలని జీవీఎంసీ 8వ వార్డు వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి అన్నారు. ఆదివారం సాగర్‌నగర్, ఎండాడ, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరిస్తున్న కోటి సంతకాలు ఒక ఉద్యమంలా సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నమ్మివానిపేటలో..

తగరపువలస: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం నిలిపివేయాలని కోరుతూ ఆదివారం జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నాయకులు నమ్మివానిపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివరించి వారి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి, చిప్పాడ వెంకటేష్, నమ్మి మాధవరావు, కరగాని అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

ఏయూ క్యాంపస్: సాగర తీరంలో సముద్రస్నానం చేయడానికి వచ్చి మునిగిపోతున్న ఇద్దరు యువకులను లైఫ్‌గార్డ్‌లు, మెరైన్ పోలీసులు రక్షించారు. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు విశాఖ పర్యటనకు వచ్చారు. ఆదివారం సాయంత్రం ఆర్కే బీచ్ వద్ద స్నానం చేస్తుండగా వారిలో ఇంజమాముల్ హక్, నయీమ్‌లు కెరటాల ధాటికి సముద్రంలోకి వెళ్లిపోయారు వెంటనే అక్కడే విధుల్లో ఉన్న జీవీఎంసీ లైఫ్ గార్డులు మునిగిపోతున్న ఇద్దరు యువకులను రక్షించారు.

కమనీయం.. శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: స్థానిక కుంతీ మాధవ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న అనంత పద్మనాభస్వామి పవిత్రోత్సవాలు ఆదివారం శాంతి కల్యాణంతో ఘనంగా ముగిశాయి. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నిత్య హోమం వంటి పూజలు నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి, రుక్మిణీ సత్య భామ సమేత వేణుగోపాల స్వామి, లక్ష్మీ దేవి విగ్రహాల నుంచి పవిత్రాలను విసర్జింప చేశారు. పూర్ణాహుతి అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి ఉత్సవ విగ్రహాలకు మంత్రోచ్ఛరణల నడుమ శాంతి కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పద్మనాభం సర్పంచ్ దంపతులు తాలాడ పాప, పద్మనాభం, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలి దంపతులు కంటుబోతు లక్ష్మి, ఎర్నాయుడుతో పాటు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు శాంతి కల్యాణాన్ని కనులారా వీక్షించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని ఓ ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలమనాలజిస్ట్ డాక్టర్ కేత ఫణిందర్ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది వ్యాధిగ్రస్తులకు డాక్టర్లు ప్రాణదాతలుగా నిలుస్తున్నారన్నారు. డాక్టర్ ఫణిందర్ ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాల ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు.

కళాకారిణులకు 'నాట్యమయూరి' అవార్డులు



నాట్యమయూరి అవార్డులు అందుకుంటున్న నాట్యరవళి అకాడమీ విద్యార్థులు

తగరపువలస: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియం.. స్థానిక నృత్య కళాకారిణుల ప్రతిభకు వేదిక అయింది. నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో తగరపువలస, సంగివలస ప్రాంతాలకు చెందిన నలుగురు కళాకారిణులు ప్రతిష్ఠాత్మక నాట్యమయూరి పురస్కారాలను కైవసం చేసుకున్నారు. తగరపువలసలోని నాట్యరవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన లిఖితసాయి, లక్ష్మీలహరి, గీతామాధురి తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరు కూచిపూడిలో జావళి, తరంగం, శబ్దం, అన్నమయ్య కీర్తనలతో పాటు కోయిరాలే, కోడిపందెం, కైకలూరి చిన్నదాన్ని వంటి జానపద నృత్య అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకు గానూ అవార్డులు గెలుచుకున్నారు. గతంలో వీరు తిరుపతి, రాజమహేంద్రవరం వంటి జాతీయస్థాయి వేదికలపైనా సత్తా చాటడం గమనార్హం. అదే విధంగా జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని సంగివలసకు చెందిన శ్రీ నృత్యప్రియ అకాడమీ నిర్వాహకురాలు చేట్ల రజనీరెడ్డి సైతం ఇదే వేదికపై నాట్యమయూరి అవార్డును అందుకున్నారు. ఆమె ప్రదర్శించిన ఆదివో అల్లదివో కూచిపూడి శాస్త్రీయ నృత్యం నిర్వాహకుల ప్రశంసలు పొందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన నాట్యరవళి అకాడమీ డైరెక్టర్ ఉమ్మిడి మహేష్‌బాబును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

దీపావళి మార్కెట్‌కు వర్షం ఎఫెక్ట్



తగరపువలస మెయిన్ రోడ్డులో డివైడర్‌పై పూజా సామగ్రి విక్రయం



మధురవాడలో ప్రమిదలు విక్రయిస్తున్న వ్యాపారి



వెలవెలబోతున్న బంగ్లామెట్ట వద్ద బాణసంచా దుకాణాలు



మధురవాడలో ప్రమిదలు విక్రయిస్తున్న వ్యాపారి

తగరపువలస: వినాయకచవితి, విజయదశమి మాదిరిగానే దీపావళి మార్కెట్‌పై కూడా వర్షం తన ప్రభావాన్ని చూపించింది. శనివారం అర్ధ రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం కారణంగా బాణసంచా, ప్రమిదలు, స్వీట్‌షాపులు, ఇతర పూజా సామగ్రి విక్రయాలు మందగించాయి. ఆదివారం సెలవు దినమైనా బాణసంచా, పూజా సామగ్రి దుకాణాలు వెలవెలపోయాయి. భీమిలి నియోజకవర్గంలో ఎక్కువ మంది ప్రజలు బాణసంచా కొనుగోలుకు విశాఖ, విజయనగరం, జామి తదితర ప్రాంతాల్లోని హోల్‌సేల్ దుకాణాలకు వెళ్లిపోయారు. స్థానికంగా విక్రయించే బాణసంచా ధరలు ఎక్కువగా ఉండటంతో బయటి ప్రాంతాల్లో 80 శాతం డిస్కౌంట్‌కు విక్రయాలు జరగడం విశేషం. గుమ్మడికాయలు, దిష్టివస్తువులు, ఆముదం కర్రల విక్రయాలు మాత్రం ఓ మాదిరిగా జరిగాయి.

36 బాణసంచా దుకాణాలకు అనుమతి..

నియోజకవర్గంలో 36 బాణసంచా దుకాణాలకు అనుమతి ఇచ్చినట్టు చిట్టివలస అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు తెలిపారు. ఆనందపురంలో ఏర్పాటు చేసిన దుకాణాలలో విక్రయాల సమయంలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాల వ్యాపారుల మధ్య స్వల్ప వివాదం చెలరేగింది. బాణసంచా దుకాణాల వద్ద పోలీసులు, స్థానిక పంచాయతీ, జీవీఎంసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కరపత్రాలు పంపిణీ జరిగింది.

అందమైన ఆకృతుల్లో దీపావళి ప్రమిదలు..

మధురవాడ: దీపావళి నేపథ్యంలో అందమైన ఆకృతుల్లోని ప్రమిదలను వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. చిన్నవి డజను రూ. 20 నుంచి రూ. 50 వరకు విక్రయిస్తుంటే.. పెద్దవి రూ. 350కి విక్రయిస్తున్నారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లో పలు రకాల ప్రమిదలను వ్యాపారులు అమ్ముతున్నారు.